



**6**

## గత సంచికనుంచి కొనసాగింపు

**జరిగిన జగన్నాటకం**

**అందరూ ఎడమచేతిని వాడే సవ్యలంకలో కుడి చేతిని వాడినందుకు బోసుకు మరణదండన విధించబోయారు. ఆచార్య వేదాంతం, ద్వీప, పశుపాల కలిసి బోసుని కాపాడారు. అతనే మహాబసు అయ్యుంటాడాని ద్వీప, వేదాంతం అనుకుంటారు. మరో వైపు పశుపాల సహాయంతో జలపతిని కలిసి ద్వీపాన్ని దాటాలనుకున్న బోసు పైన పిడుగు పడటంతో స్పృహ తప్పాడు. సముద్రంలో ఇరవై అడుగుల అల పైకి లేచింది.**

అది మనిషి శరీరాన్ని, శరీరంలోని ప్రాణాన్ని, ప్రాణాన్నిఆశ్రయించిన ఆత్మని అమాంతంగా అగాధంలోకి నెట్టేసిన అనుభూతి. ఉప్పటి నీటిలో మునక, ఆ పైన ఆవహించిన మత్తు,. బతుకుతానో, బతకనో అన్న భయం కూడా పుట్టలేని మానసిక స్థితి. అతనికి జరుగుతున్నదేమిటో అస్పష్టంగా అర్థం అవుతోంది. ఇలాంటి మత్తు కమ్మేసినప్పుడే అతనికి గాంధీ కనిపించాడు. మళ్ళీ గాంధీ కనిపిస్తే జరుగుతున్నదేమిటో వివరంగా అడిగి తెలుసుకోవాలి అనుకున్నాడు. సరిగ్గా అప్పుడే ఎవరిదో గొంతు వినపడింది.

“పారిపోతున్నావా?” వినపడింది బోసుకు. కళ్ళు తెరవడం సాధ్యం కాలేదు.

"ఎవరది?" అన్నాడు అతి కష్టం మీద. అవతల వ్యక్తి గట్టిగా నవ్వాడు.

"నా పేరు పెట్టుకున్నావు కానీ నేను ఎవరో తెలియదా?" అన్నాడతను. బోస్ అతి కష్టం మీద కళ్ళు తెరిచాడు. ఎదురుగా వున్నది గాంధీ కాదు. బోస్. సుభాష్ చంద్ర బోస్!!

"సుభాష్.. మీరా?" అన్నాడు ఆశ్చర్యంగా. ఎదురుగా మిలటరీ దుస్తుల్లో వున్న వ్యక్తి సుభాషేనని తెలిసినా అడగకుండా వుండలేకపోయాడు.

"అవును... నేనే... ఏం రాకూడదా?"

"అలా అని కాదు. నేను గాంధీజీ వస్తారని ఊహించాను." అన్నాడు. ఆయన గట్టిగా నవ్వాడు.

"ఎవరు వచ్చారని కాదు... వచ్చిన వ్యక్తి ఏం చేశాడన్నది కదా ముఖ్యం... నువ్వా ఈ ద్వీపానికి వచ్చావ్... ఇప్పుడు వెళ్ళిపోతున్నావు. ఏం సాధించావు?" అడిగాడు సూటిగా చూస్తూ.

"ఏంటి సుభాష్... నేను సాధించడమేమిటి? మీరు కూడా గాంధీలానే మాట్లాడుతున్నారు."

"గాంధీది పశ్చిమం నాది తూర్పు... నేనూ ఆయనలాగే మాట్లాడానా? ఏమన్నాడాయన?"

"ఇక్కడే వుండిపొమ్మన్నారు"

"అయితే వుండిపో.."

"ఇక్కడి సంగతులు మీకు తెలియదు సుభాష్... ఎడమ చేతిని వాడాల్సిన చోట కుడిచేతిని వాడినందుకు చంపేస్తున్నారు..." కోపం అసహనం కలగలిసిందతని గొంతులో.

"అయితే ఎడమ చేతినే వాడచ్చు కదా?" నవ్వాడు సుభాష్.

"అలా ఎలా కుదురుతుంది? నేను కొన్ని ముఖ్యమైన పనులకు, అంటే భోజనం చెయ్యడం, భగవంతుడి ధ్యానం వంటి పనుల్లో కుడి చేతినే వాడతాను"

"ఎందుకు?"

"ఎందుకేమిటి... అలాగే వాడాలని నమ్ముతాను కాబట్టి." అతనలా అంటుంటే అప్రయత్నంగా పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

"నువ్వు నమ్మినదాని కోసం పోరాడాలి కానీ, వెళ్ళిపోతానంటున్నావే?"

"మీకేం దాదా ఎన్నైనా చెప్తారు... ఇక్కడ పోరాడితే ప్రాణాలే పోయేట్టున్నాయి" బోస్ గొంతులో భయంలేదు కానీ ఏదో న్యూనత వుంది. అది సుభాష్ గుర్తించాడు.

"పోయే ప్రాణాలు ఎలాగైనా పోతాయి. కానీ ఒక నమ్మకం కోసం నీ ప్రాణం పోతే ఆ నమ్మకమే వేయి ప్రాణాలలో పునర్జన్మ పొందుతుంది. ఒక విలువ కోసం నువ్వు చనిపోతే ఆ విలువ గొప్పదనాన్ని నిలబెట్టినవాడివౌతావు..."

"అంటే చచ్చిపొమ్మని చెప్తున్నారా?"

"చావు ఒక సంఘటన మాత్రమే. ఆ లిప్త కాల సంఘటన ఎప్పుడొస్తుందో అన్న భయంతో ఏ పని చెయ్యకుండా వుండటం అవివేకం..." మళ్ళీ మనోహరంగా నవ్వాడాయన.

"ఒప్పుకుంటాను. కానీ ఇదంతా విచిత్రంగా వుంది. ఏది నిజమో ఏది అబద్ధమో తెలియని సందిగ్ధంలో..." అంటూ ఆగిపోయాడు బోస్

"నిజాన్ని పూర్తిగా అర్థం చేసుకోవాలుకోవడం అవివేకం. మనకు అర్థమైనంత నిజాన్నే ఒక సిద్ధాంతంగా మలచుకోని దాని ఆధారంగా ముందుకు సాగాలి..."

"మరి మనకు తెలిసిన నిజం కాకపోతే? అది నిజం కాదని తెలిసినప్పుడు...?"

"అలా అనిపించాలంటే నీకు మరింత విస్తృతమైన నిజం తెలియాలి... అప్పుడు అది మరో సిద్ధాంతమౌతుంది. అదే మార్గదర్శకమౌతుంది."

బోసు ఆలోచనలోపడ్డాడు. సుభాష్ కళ్ళలో తీక్షణత, మాటల్లో వున్న పదును బోసుని ఇబ్బంది పెట్టింది. సుభాష్ వైపే చూస్తూవుండిపోయాడు. ఉన్నట్టుండి సుభాష్ వెనక నుంచి ఒక పెద్ద అల నాలుకలు చాచిన మహాసర్పంలా దూసుకు వచ్చింది.

"దాదా" అంటూ అరిచాడు బోస్. అప్పటికే ఆ అల సుభాష్ చంద్రబోస్ ని మింగేసి, అమాంతంగా వచ్చి బోసు మీద పడింది. బలమైన చేతులతో ఎవరో తోసేసినట్లు పడిపోయాదతను.

★★★

ఒక్కసారిగా మెలకువ వచ్చింది. అప్రయత్నంగా తెరుచుకున్న నోటిద్వారా ఉప్పునీటిని మింగాడు బోస్. కళ్ళు తెరిచేసరికి తను సముద్రంలో మునిగిపోతున్న సంగతి గ్రహించాడు. కుడి అరచేతిని నోటికి ముక్కుకు అడ్డంగా పెట్టుకోని, ఎడమచేతితో ముందుకు ఈదడానికి ప్రయత్నించాడు. అప్పటికి ఎంత నీటిని మింగాడో తెలియదు కానీ కడుపులో చాలా నీరు చేరి బరువుగా అనిపించింది. కళ్ళముందు అస్పష్టంగా, అనంతంగా నీరు తప్ప ఇంకేమీ కనపడటంలేదు. ఎటు వైపుకు ఈదితే ఎక్కడకు చేరతాడో తెలియట్లేదు. కానీ బ్రతకాలంటే ఈదాలని మాత్రం తెలుసు.

తను ఎక్కడివాడో తెలియదు. ఈ ద్వీపానికి ఎందుకు వచ్చాడో తెలియదు. ఆ ద్వీపాన్ని వదిలి ఎక్కడుందో తెలియని సింధూరదేశానికి వెళ్ళాలని ఎందుకు నిర్ణయించుకున్నాడో తెలియదు. ఇప్పుడు మాత్రం మరణం అంచులో వున్నాడు. బ్రతకాలని వుంది. కానీ బ్రతికి ఏం సాధించాలో తెలియదు. తెలిసీ తెలియని ఒక వ్యక్తిని నమ్మి ఎవరో తెలియని వ్యక్తిని కలవడానికి వచ్చాడు. కలిస్తే ఏం జరిగుండేదో ఆలోచించాలని కూడా అనిపించలేదు అతనికి. ఒకవేళ బ్రతికినా దళాధిపతి వదిలేస్తాడన్న నమ్మకం లేదు. ఎడమచేతిని వాడినందుకే మరణశిక్ష విధించాలని చూశాడతను. ఇప్పుడు సంఘబహిష్కరణలో వున్న వ్యక్తిని కలవడానికే సముద్రతీరానికి వచ్చాడని తెలిస్తే? ఈసారి కాపాడటానికి కూడా ఎవరూ ముందుకు రాకపోవచ్చు. ఆలోచిస్తున్న కొద్దీ బ్రతకాలన్న కోరిక కూడా చచ్చిపోసాగింది. ఈదడం ఇక అసంభవం అనుకున్నాడు. బ్రతకాలన్న కోరిక స్థానంలో ఇక బ్రతకనన్న నమ్మకం వచ్చి చొరబడుతోంది. ఈదడం ఆపేశాడు. అతని శరీరం నెమ్మదిగా సముద్రపు అడుగువైపు జారిపోసాగింది. శ్వాస తీసుకోకుండా అడ్డం పెట్టుకున్న కుడిచేతిని తీసి గట్టిగా ఊపిరి పీల్చాడు. ముందు ముక్కులోకి, నోట్లోకి ఆ తరువాత గుండెల్లోకి, ఊపిరితిత్తుల్లోకి, కడుపులోకి ఉప్పునీరు ప్రవేశించింది. తట్టుకోలేని బాధతో కాళ్ళు చేతులు గిలగిలా కొట్టుకున్నాయి. క్రమంగా స్పృహ తప్పుతోంది. సరిగ్గా మరో క్షణంలో పూర్తి స్పృహ కోల్పోతాడనగా ఎవరిదో చెయ్యి అతని చేతిని అందుకున్నట్లు లీల తెలిసింది. ఆ తరువాత స్పృహతప్పింది

★★★

## 6

బోస్ కళ్ళు తెరిచాడు. ఎదురుగా ఆకాశం కనపడింది. సరిగ్గా కొన్ని రోజుల క్రితం సముద్రపు ఒడ్డున కళ్ళు తెరిచినప్పుడు ఇలాంటి ఆకాశమే కనపడింది. లీలగా మబ్బులు తిరుగుతున్నాయి. మరుక్షణం గాంధీ, బోసులు గుర్తుకువచ్చారు. ఇలా స్పృహ ఉండీ లేని ప్రతిసారీ ఆ ఇద్దరిలో ఎవరో ఒకరు కనిపించారు. ఈసారి కూడా అలాగే ఎవరైనా కనపడతారేమో అని అటూ ఇటు చూశాడు. ఎవరూ లేరు.

శక్తినంతా ఎవరో లాగేసినట్లు ఒళ్ళంతా నొప్పులుగా వున్నాయి. అయినా అతి కష్టం మీద లేచి కూర్చున్నాడు. తను వున్నది ఒక ఓడలో అన్న విషయం అర్థం అయ్యింది. మనుషులెవ్వరూ కనిపించకపోవటమే ఆశ్చర్యంగా వుందతనికి.

"ఎలా వుంది ఇప్పుడు" వెనుక నుంచి ఒక గొంతు వినపడింది. ఒక్కసారిగా అదిరిపడి వెనక్కి తిరిగాడు.

'అతను' ఆరడుగులు పైనే వుంటాడు. చిందరవందరగా వున్న జుట్టు. బాగా పెరిగిపోయిన గడ్డం మీసం. పిచ్చివాడిలా వున్నాడు. కానీ చూపే చాలా తీక్షణంగా వుంది. కనుబొమ్మలు ఎగరేసి మళ్ళీ ప్రశ్నను గుర్తుచేశాడతను.

"ఇప్పుడు బాగానే వుంది. చచ్చిపోయాననుకున్నాను. మీరే నన్ను కాపాడినట్లున్నారు. కృతజ్ఞతలు" అన్నాడు. అతను గట్టిగా నవ్వాడు. ప్రశాంతమైన సముద్రం మధ్యలో అతని నవ్వు ప్రతిధ్వనించింది.

"కృతజ్ఞతలు చెప్పాల్సిన పనిలేదు. నేను వున్నదే నిన్ను కాపాడటానికి." అన్నాడతను.

"ఎవరు మీరు? నన్ను కాపాడటానికి మీరు వుండటమేమిటి?" అడిగాడు బోస్ ఆశ్చర్యంగా.

"నేను ఎవరో తెలియదు కానీ, నన్ను కలవాలని వచ్చావా?" చిరునవ్వు చెరగకుండానే వ్యంగ్యంగా అడిగాడు.

"అంటే మీరు జలపతా?" అంటూనే బోస్ నిలబడ్డాడు. అవునన్నట్లు తలాడించాడు జలపతి.

"నేను వస్తున్నానని మీకెలా తెలుసు? నన్ను కాపాడాలని మీరెందుకు అనుకున్నారు? దయచేసి అర్థమయ్యేలా చెప్పండి" అన్నాడు బోస్.

"అన్ని వివరంగా మాట్లాడుకుందాం. ముందు నువ్వు కొద్దిగా విశ్రమించాలి. కడుపు నిండా ఉప్పునీరు తాగావు. నిన్ను బయటకు లాగిన తరువాత అదంతా కక్కించాను. బాగా అలిసిపోయి వుంటావు" అన్నాడతను. అప్పుడుకానీ బోస్ తన శరీర పరిస్థితిని గుర్తించలేదు. తలంతా భారంగా వుంది. కడుపులో పేగులు మెలితిరిగినట్లు విపరీతమైన బాధగా వుంది. అయినా అవన్నీ లెక్కచెయ్యలేదతను.

"ఫర్లేదు... ప్రాణం పోయినా ఫర్లేదని నిర్ణయించుకున్న తరువాతే మీరు నన్ను కాపాడారు. ఇంక కొత్తగా పోయేదేమి లేదు. ఇప్పుడు శరీరానికి వున్న బాధ కన్నా, ఏమాత్రం అర్థం కానీ ఈ ప్రపంచం నన్ను మానసికంగా ఎక్కువ బాధపెడుతోంది. దయచేసి వివరంగా చెప్పండి" అంటూనే శక్తిలేక మోకాళ్ళ మీద కూలబడిపోయాడు.

జలపతి పరుగులాంటి నడకతో బోసు దగ్గరకు వచ్చి, అతనికి ఆసరాగా నడుము చుట్టూ చేతిని వేసి పైకి లేపాడు. "లోపలికి వెళ్దాం పద" అంటూ పడవ ముందు భాగంలో వున్న చిన్న గదిలోకి తీసుకెళ్ళాడు. వేడిగా పాలు ఇచ్చి బోస్ స్థిమితపడేలా చేశాడు. ఆ తరువాత బోస్ అడిగిన ప్రశ్నలకు సమాధానంగా చెప్పడం మొదలుపెట్టాడు.

"ఇలాంటి ప్రళయం వస్తుందని నాకు ముందే తెలుసు. తెలియటమే కాదు, ఈ ద్వీపానికి నువ్వు వస్తావనీ, ఆ తరువాత మహాప్రళయం సంభవిస్తుందని నేను ప్రకటించాను. ఆ విషయాన్ని ప్రజలందరికీ చెప్పాను. అదే నేను చేసిన తప్పు. అందుకే ఈ సంఘబహిష్కరణ" అంటూ గట్టిగా నవ్వాడు.

"ఏమంటున్నారు జలపతీ? నేను వస్తానని తెలుసా? నాతోపాటు ప్రళయం వస్తుందని కూడా తెలుసా? ఇదెలా సాధ్యం?" ఆశ్చర్యంగా అడిగాడు బోస్.

"ఇదంతా నా గొప్పతనం కాదు. మహాజ్ఞాన గ్రంథంలో జరగబోయేదంతా రాయబడి వుంది. అయితే అది అందరికీ అర్థమయ్యేంత సులువుగా వుండదు. కొన్ని విషయాలు కథల రూపంలో, మరికొన్ని ప్రతీకలతో, తప్పుదోవ పట్టించే అసందర్భ విషయాలతో అత్యంత గోప్యంగా, నిగూఢంగా రాయబడి వుంటుంది. దాన్ని అర్థం చేసుకున్న వాళ్ళు ఈ ద్వీపంలో ఇద్దరే వున్నారు. నేను, ఆచార్య వేదాంతం. ఆయనే నువ్వు నన్ను కలవడానికి వస్తున్నావని వర్తమానం పంపారు" అని ఆపాడు జలపతి. బోస్ ఆశ్చర్యంతో నోట మాటరాక

వుండిపోయాడు. చెప్పిన విషయం బోస్ కు పూర్తిగా అర్థమవ్వాలని మౌనంగానే వుండిపోయాడు జలపతి. కొద్దిసేపటి మౌనం తరువాత బోస్ నోరు విప్పాడు.

"మీరు చెప్పినదాంట్లో కొంతే అర్థం అవుతోంది. అంటే నేను వస్తాననీ, నాతో పాటు ప్రళయం వస్తుందనీ ముందే చెప్పబడిందంటారు? సరే అదే నిజం అనుకుందాం. ఆ విషయాన్ని మీరు ప్రజలకు చెప్పినందుకు సంఘబహిష్కరణ శిక్షపడటమేమిటి?" అడిగాడు బోస్

"నువ్వు రావటం ఈ ద్వీపాన్ని పాలించే మహాధినేతకు ఇష్టంలేదు. నువ్వు ఇక్కడికి వచ్చావంటే అది అతనితో పోరాడటానికేనని మహాజ్ఞాన గ్రంథం చెప్తోంది. అందుకని నేను చెప్పిన కఠోర వాస్తవం వాళ్ళకు ధిక్కారంలా వినిపించింది" అన్నాడు జలపతి. బోస్ గట్టిగా నవ్వాడు.

"ఇప్పటిదాకా ద్వీపంలో ప్రతిదానికి ఎడమ చేతిని వాడే పిచ్చివాళ్ళను చూశాను. ఇప్పుడు ఎవరో తెలియని ఒక అనామకుణ్ణి పట్టుకోని నీ వల్లే ప్రళయం వచ్చింది, నీ వల్ల ఈ దేశాధినేతకు ప్రమాదం వుంది అని చెప్పే కొత్త పిచ్చివాణ్ణి చూస్తున్నాన్నమాట. అయ్యా, మీకు ఒక నమస్కారం. నా ప్రాణం కాపాడారు, అందుకు నేను మీకు ఎంతో రుణపడి వుంటాను. మీరు నన్ను సింధూరదేశానికి పంపిచేస్తే అక్కడ నా జాతి మనుషులు ఎక్కడున్నారో చూసుకోని, ఇక ఈ వైపుకి కూడా రాకుండా అక్కడే వుండిపోతాను" అన్నాడు బోస్ వెటకారంగా. జలపతి చిరునవ్వుతో అతను చెప్పినదంతా విన్నాడు.

"ఎందుకు వెళ్ళాలనుకుంటున్నావు?" అన్నాడు చివర్లో.

"ఎందుకేమిటి? ఇక్కడ ఈ పిచ్చివాళ్ళతో పడలేను. మీతో సహా" అన్నాడు కోపంగా బోస్.

"అవును నీకు నచ్చని నమ్మకం ఎప్పుడూ పిచ్చిగానే కనపడుతుంది. మరి ఆ పిచ్చివాళ్ళని మంచిదారిలో పెట్టే ప్రయత్నం చేయచ్చుకదా?"

"ఎలా చేసేది. కాదంటే ప్రాణాలే తీస్తామంటున్నారు..." అన్నాడు.

"పోయే ప్రాణాలు ఎలాగైనా పోతాయి. కానీ ఒక నమ్మకం కోసం నీ ప్రాణం పోతే ఆ నమ్మకమే వేయి ప్రాణాలలో పునర్జన్మ పొందుతుంది. ఒక విలువ కోసం నువ్వు చనిపోతే ఆ విలువ గొప్పదనాన్ని నిలబెట్టినవాడివౌతావు..." అన్నాడు జలపతి. బోస్ ఆశ్చర్యంతో రెండు కళ్ళు పెద్దవి చేసి చూశాడు.

"బోస్... సుభాష్ చంద్రబోస్ కదూ మీరు" అన్నాడు

"నేను కాదూ నువ్వే బోసువి, నేను జలపతిని కదా" అన్నాడతను నవ్వుతూ. బోస్ ఇంకా ఆశ్చర్యం నుంచి తేరుకోలేదు. అదే వాక్యాలను మళ్ళీ మళ్ళీ వినటం విచిత్రంగా అనిపించింది. ఇలా జరగటం అతనికిది రెండోసారి.

"అయితే ఇప్పుడేమంటారు?" అన్నాడు తన ఆశ్చర్యాన్ని కప్పిపుచ్చుకుంటూ.

"ప్రస్తుతానికి నేనేమి అనను. ఎగసిపడ్డ సముద్రపు అలలు సవ్యలంక పొలిమేరదాకా వెళ్ళి తిరిగి వచ్చాయి. ఈ ప్రళయం కాస్త సర్దుకునేదాకా నువ్వు నాతోనే వుండచ్చు..."

"నేను మళ్ళీ నేలమీద అడుగుపెట్టను. మిమ్మల్ని కలిశానని తెలిస్తే ఆ దళాధిపతి బ్రతకనివ్వడు. మీరు చెప్పినట్లు నా వల్ల ప్రళయం వచ్చిందని అతను కూడా నమ్మితే మరుక్షణం నేను మట్టిలో కలిసిపోతాను" అన్నాడు బోస్.

"ప్రళయం ఇంకా రాలేదు బోస్. చెప్పానుగా... సముద్రపు అలలు నగరాన్ని తాకలేదు. అంటే ఇంకా కాలాంతం చేసే మహాప్రళయం రాలేదన్నమాట. అది వచ్చినరోజు ఈ లంక మీద ఎడమచేతిని వాడే మనుషుల జాడ కూడా వుండదు. ఆ రోజు కోసం నిన్ను ఉండమంటున్నాను" అన్నాడు జలపతి. బోస్ కి ఇంకా అయోమయంగానే వుంది.

"నాతో వచ్చిన పశుపాల ఎక్కడ?అతనికేమన్నా...?" ఖంగారుగా అడిగాడు.

"అతనికేం ఫర్లేదు. నిన్ను కాపాడటానికి ముందే అతన్ని కూడా కాపాడాను. నాతోరా చూపిస్తాను." అంటూ ముందుకు నడిచాడు జలపతి. ఓపిక తెచ్చుకోని లేచి అతని వెంటే నడిచాడు బోస్.

ముందు గమనించలేదు కానీ, అది చాలా పెద్ద ఓడ. గదులు గదులుగా దాదాపు మూడంతస్థులు కట్టినట్లుగా వుంది. సంభ్రమంగా వాటన్నింటినీ చూస్తూ నడిచాడు బోస్. అతని కాళ్ళకి అడ్డం పడుతూ ఎవరో పరుగెత్తినట్లు అనిపించి కిందకు చూశాడు. రెండు ఉడుతలు అటూ ఇటూ గెంతుతూ ఆడుతున్నాయి. నడి సముద్రంలో, ఒక ఓడలో ఉడుతలు కనపడటం చాలా ఆశ్చర్యంగా అనిపించింది అతనికి. కానీ ఆ విషయాన్ని అంతగా పట్టించుకోలేదు. మెట్లెక్కి రెండో అంతస్థుకు చేరుకున్నారు ఇద్దరూ. ఒక పెద్ద తలుపు తెరిచి లోపలికి వెళ్ళమన్నాడు జలపతి.

లోపలికి అడుగుపెట్టకముందే రకరకాల జంతువుల, పక్షుల అరుపులు వినపడ్డాయి బోసుకి. తలుపు దాటిలో లోపలికి వెళ్ళగానే ఆశ్చర్యంతో అలాగే నిలబడిపోయాడు. అక్కడ దాదాపు అన్ని రకాల జీవరాశులు జంటలు జంటలుగా వున్నాయి. చిన్న చీమ నుంచి మత్తగజాల దాకా, చిన్న పిట్ట నుంచి ఆరడుగుల ఎత్తు వున్న పక్షులదాకా అన్నీ ఒకే చోట!! అంతకన్నా ఆశ్చర్యకరమైన విషయం మరొకటి వుంది. ఆ జంతువుల మధ్య స్పృహలేకుండా పడివున్నాడు పశుపాల. ఆశ్చర్యంగా జలపతి వైపు చూశాడు బోస్.

"మహాప్రళయం వస్తుందని తెలుసు. అదే జరిగితే ఈ లంక మొత్తం నాశనం అయిపోతుంది. సృష్టి ఆగిపోతుంది. అందుకని అన్ని రకాల జీవరాశులను ఒక పడవలో ఎక్కించి, జలప్రళయం ఆగిపోయేదాకా వాటిని సంరక్షించాలని మహాజ్ఞానగ్రంథం చెప్తోంది. ఆ పని చెయ్యడానికి నేను పూనుకున్నాను. అదృష్టవశాత్తు ఇప్పుడు సంభవించింది మహాప్రళయం కాదు. కానీ ఆ రోజు ఎంతో దూరంలో లేదు అని హెచ్చరికలా ఈ రోజు అలలు నగరం పొలిమేరదాకా సాగాయి. మళ్ళీ మహాప్రళయం వచ్చేవరకు ఈ జీవరాశిని నేనే కాపాడాలి." అన్నాడు.

బోసుకు ఇదంతా నమ్మశక్యంగా అనిపించలేదు. అలాగని జలపతి జ్ఞానాన్ని తక్కువగా అంచనా వేయడానికి మనసు అంగీకరించట్లేదు.

"అన్ని జీవరాశులతో పాటు మనుష్యులను కూడా జంటగా వుంచితే కదా, మనుష్యజాతి అంతమవకుండా వుండేది? చూడబోతే మనం ముగ్గురం మగవాళ్ళమే వున్నాము" అన్నాడు బోసు నవ్వుతూ. జలపతి తలాడించాడు. దూరంగా వున్న తలుపు తెరుచుకుంది. ఆ ద్వారం నుంచి నడుచుకుంటూ ముందుకు వచ్చింది ద్వీప!!

★★★

**(జరగబోయే జగన్నాటకం వచ్చే మాసం)**

COMMENTS